# టిడిపి ఓటమికి పనిచేసిన వ్యక్తికి రాష్ట్ర కార్యదర్శి పదవా..?

- అమ్ముడుపోయే గుణం మీది - అభిమానంతో పనిచేసే గుణం మాది - బిజెపి నాయకులు



మాట్లాడుతున్న బిజెపి నాయకులు

**ధర్మవరం టౌన్; మార్చి 24 ప్రభాత వార్త :** ధర్మవరంలో టిడిపిని ఓడించేందుకు పనిచేసిన వ్యక్తికి టిడిపి రాష్ట్ర కార్యదర్శి పదవి ఇప్పించడం విడ్డూరమని బిజెపి నాయకులు ఎద్దేవాచేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు చేస్తూ అజ్ఞాతంలో ఉన్న విజయకుమార్‌కు ఉన్నతపదవి ఇవ్వడాన్నిచూసి జనం నవ్వుకుంటున్నారని వారు విమర్శించారు. శుక్రవారం పట్టణ మైనార్టీ అధ్యక్షుడు నబీరసూల్ విలేకర్లతో మాట్లాడుతూ అమ్ముడుపోయే గుణం మీదేనని, నాయకునికి అభిమానంతో పనిచేసే గుణం మాదని ఆయన అన్నారు. అలాంటి సంస్కృతి మీవద్ద ఉందేమోనని ఆయనఎద్దేవాచేశారు. 2009, 2014, 2019 లలోజరిగిన అసెంబ్లీఎన్నికల్లో ఇప్పుడు మాట్లాడిన వారు ఏ పార్టీకి పనిచేశారో చెప్పాలని తెలిపారు. ఒక్కొక్కరు ఒక్కొక్క పార్టీలో పనిచేస్తూ ధర్మవరం టిడిపికి వ్యతిరేకంగా పనిచేసిన విషయం ఎవ్వరికి తెలియదని ప్రశ్నించారు. నియోజకవర్గ అభివృద్ధిలో గోను గుంట్ల సూర్యనారాయణకు ఎవ్వరూ సాటిరారన్న నిజం అందరికీ తెలిసిన విషయమేనని తెలిపారు. అత్యధిక ప్రభుత్వపథకాలను నియోజకవర్గ ప్రజలకు అందజేయడంలో తమ నాయకుడు ముందున్నారన్నారు. ధర్మవరం ముస్లిం మైనార్టీలకు గోనుగుంట్ల చేసిన మేలు ఎవరూ చేయలేదన్న విషయం ముస్లింలకు తెలుసన్నారు. తమ నాయకుడు ఏపార్టీలో ఉన్నా, నియోజకవర్గ ప్రజలలో ఉంటూ ఆదుకున్నారన్నారు. అధికారపార్టీ నాయకులు అరాచకాలతోపాటు దౌర్జన్యాలను, కబ్జాలను ఎత్తిచూపుతూ ఉన్నారని, మీ నాయకుని మాదిరి చేతులు ముడుచుకుని కూర్చోలేదన్నారు. ధర్మవరంచెరుకు కృష్ణాజలాలను సాధించిన గోనుగుంట్ల సూర్యనారాయణ అందరివాడై నియోజకవర్గ ప్రజల గుండెల్లో ఉన్నారన్నారు. ఏ పార్టీలో ఉన్నా గోనుగుంట్లను గెలిపించేందుకు జనం ఎదురుచూస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో మల్కాపురం బాబా, మల్లేనిపల్లి రాజు, బండ్లపల్లి రాజు, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ ముఖ్యమంత్రి కావాలని తిరుమలకు పాదయాత్ర




విజయ సంకల్ప యాత్ర

**ధర్మవరం టౌన్, మార్చి 24 ప్రభాతవార్త :** వచ్చే ఎన్నికల్లో జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగానూ చిలకం మధుసూధనరెడ్డి ధర్మవరం ఎంఎల్ఎగానూ ఎన్నిక కావాలని కోరుతూ తిరుమలవెంకటేశ్వరస్వామి సన్నిధికి కాలినడకన పయనమయ్యారు. విజయసంకల్ప యాత్రపేరుతో కేలావత్ నాయుడు ఆధ్వర్యంలో లక్ష్మినారాయణ, కడపల సుధాకరరెడ్డి, ధారా గంగాధర్, గొంగటి హరి, వెంకటేష్‌నాయక్, నారాయణ నాయక్, మాలపాటిశ్రీరాంలు దీక్ష పూని కాలినడకన శుక్రవారం ధర్మవరం నుండి పయనమయ్యారు. స్థానిక కొత్తపేట వెలసిన వెంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి తమయాత్రను ప్రారంభించారు. చేనేతలు, రైతుల కష్టాలతో పాటు సామాన్యజనం ఇబ్బందులు తెలిసిన చిలకంమధుసూధనరెడ్డి ధర్మవరంఎంఎల్ఎగా ఎన్నిక కావాలని వారు స్వామివారిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ యాత్రకు సంఘీభావంగా పెద్దసంఖ్యలో జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉచిత పరీక్ష కిట్స్‌పంపిణీ



విద్యార్థులకు సడ్డీమెటీరియల్ అందిస్తున్న దృశ్యం.

**పెనుకొండ మార్చి24 ప్రభాతవార్త :** పదోతరగతి విద్యార్థులకు ఉచిత పరీక్ష కిట్స్‌ను శుక్రవారం పంపిణీ చేశారు. ఆత్మీయఎ ట్రస్ట్, యుటీఎఫ్ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షులు జయచంద్రారెడ్డి ఆర్థిక సహకారంతో యుటీఎఫ్ పెనుకొండ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని జె డ్పిబాలికల ఉన్నత పాఠశాల్లో ఈ కార్యక్రమం చేపట్టారు. 60 మంది పదోతరగతి విద్యార్థులకు సడ్డీమెటీరియల్‌ను అందించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ నరేష్, నారాయణ స్వామి, పెద్దిరాజు, ప్రధానోపాధ్యాయురాలుజ్యోతిలత రంగనాయకమ్మ, గాయత్రి ఆశాజ్యోతి, శ్రీదేవి, లావణ్య, రాజేశ్వరి, దీవెన తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీవిజయం పై తెలుగుదేశంపార్టీ శ్రేణులు సంబరాలు



టపాసులు కాల్చి సంబరాలు జరుపుకుంటున్న తెదేపాశ్రేణులు

**పెనుకొండ మార్చి24 ప్రభాతవార్త :** ఎమ్మెల్యే కోటాలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి పంచుమర్తి అనురాధ విజయం సాధిపంచడంతో పెనుకొండ తెలుగుదేశం శ్రేణులు సంభరాలు జరుపుకున్నారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్రకార్యనిర్వాహకకార్యదర్శి సవిత ఆధ్వర్యంలో ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున బాణాసంచా పెల్చారు. ఎన్టీఆర్ జిందాబాద్, చంద్రబాబునాయుడు నాయకత్వం వర్ధిలాలి అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు మాధవనాయుడు, శ్రీరాములు, బాబుల్‌రెడ్డి, తివేంద్రనాయుడు, దాదు, నారాయణస్వామి, నరహరి, సుబ్రమణ్యం, మణికంత, వాసుదేవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి జన్మదిన వేడుకలు



ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డికు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

**ఉరవకొండ, మార్చి 24 ప్రభాత వార్త :** ఎమ్మెల్సీ, వైసీపీ సీనియర్ నేత వై. శివరామిరెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం నియోజకవర్గ వ్యాప్తంగా వైసీపీ శ్రేణులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. విజయవాడలో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానుల సమక్షంలో కేక్ కట్‌చేశారు. ఎమ్మెల్సీకు ఉరవకొండ నియోజకవర్గంతోపాటు ఉమ్మడి జిల్లా నుండి వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, అనధికారులు, అభిమానులు పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కాగా గురువారం పుట్టినరోజు జరుపుకున్న ఆదోని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డికు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్‌యార్డు మాజీఛైర్మెన్ యం.వి.రమణ యాదవ్, డీసీయంఎస్ మాజీ ఛైర్మెన్ జయచంద్రనాయుడు, జె.రాంపురం సర్పంచ్ తిరుపాల్‌యాదవ్, నాయకులు ఆమిద్యాల చెన్నప్పరెడ్డి, చిన్నముష్టూరు ఎర్రిస్వామి, పెద్దముష్టూరు అర్జున్, ఉప్పర ధనుంజయ, దుద్దేకుంట సూరి, పాల్తూరు మాహలింగ, రామకృష్ణ, తదితరులు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేను కలిసి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

# యువగళం పాదయాత్రను విజయవంతం చేయండి - బి.కె పార్థసారథి

**రొద్దం, మార్చి 24 ప్రభాతవార్త :** మండల పరిధిలోని మరువపల్లిగ్రామంలోని శ్రీ సత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు బి.కె పార్థసారథి స్వగృహంలో నారాలోకేష్ చేపట్టిన పాదయాత్ర అలాగే గోరంట్లలో జరుగు బహిరంగ సభను విజయవంతం చేయాలని బి.కె పార్థసారథి టిడిపి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం ప్రజలు ఎదురు చూస్తూ ఉత్సహం కనబరుస్తున్నారని.. టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు, నియోజకవర్గ అధ్యక్షులు చిన్నప్పయ్య, మండల కన్వీనర్ నరహరి, సీనియర్ నాయకులు బొక్కసంపల్లి రామకృష్ణప్ప, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు ఈసీ హరీష్, మండల ప్రధాన కార్యదర్శి మురళీ, మాజీ డీలర్ వెంకటేష్, మండల మైనార్టీ అధ్యక్షులు మున్నా, రుద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలను పరిష్కరింపజేయాలని వాహనాల డ్రైవర్లకు, క్లీనర్లకు బి.కె వినతి

**రొద్దం, మార్చి 24 ప్రభాతవార్త :** తాము నిద్రలు మాని వాహనాల ద్వారా సరుకు సురక్షితంగా గమ్యాలకు చేరుస్తున్నామని.. కానీ అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని.. మా సమస్యలు వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదని తెలుగురాష్ట్రాల భారీ వాహన డ్రైవర్లు, క్లీనర్లు హక్కుల సాధన సమితి గుడివాడ కు చెందిన వారు శుక్రవారం శ్రీసత్యసాయి జిల్లా టిడిపి అధ్యక్షులు బి.కె పార్థసారథి కు వినతి పత్రం అందజేశారు ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తాననీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రొద్దం నరసింహులు, ఈ చిన్నప్పయ్య, నరహరి, ఈసీ హరీష్, మురళీ నారాయణ, మసూద్, అలీ, సురేంద్ర పాల్గొన్నారు.

# సీనియర్ జర్నలిస్టు శ్రీనాథ్‌రెడ్డి భౌతికకాయానికి ఘన నివాళులు





శ్రీనాథ్‌రెడ్డి భౌతిక కాయంపై పుష్పగుచ్చం ఉంచి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ,నివాళులర్పిస్తున్న వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వై.మధుసూదన్‌రెడ్డి

**ఉరవకొండ, మార్చి 24 ప్రభాతవార్త :** సీనియర్ జర్నలిస్టు, ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ మాజీ ఛైర్మెన్ దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి భౌతికకాయానికి మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వై.మధుసూదన్‌రెడ్డి నివాళులర్పించారు. శ్రీనాథ్‌రెడ్డి ఈనెల 22వ తేదీన బుధవారం రాత్రి హైదరాబాద్‌లో ఆయన అనారోగ్యంతో మృతి చెందగా ఆయన భౌతికకాయాన్ని స్వగ్రామం కడప జిల్లా సింహాద్రిపురం మండలం కోవరంగుట్టపల్లి గ్రామానికి తరలించారు. ఈక్రమంలో వారు అక్కడికి వెళ్లి భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా వై.విశ్వేశ్వరరెడ్డి, వై.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ దాదాపు 4 దశాబ్దాలుగా జర్నలిస్టుగా పనిచేసిన శ్రీనాథ్‌రెడ్డితో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సుదీర్ఘ కాలం కడప, హైదరాబాద్‌లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూప్, బీబీసీ, సాక్షి మీడియాలో జర్నలిస్టుగా సేవలందించారన్నారు. ఆయన మృతి పత్రికా రంగానికి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట బెస్త కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కె.వి.రమణ, సీనియర్ జర్నలిస్టులు రాచమల్లు భోగేశ్వరరెడ్డి, తలారి రామాంజినేయులు, ఆజాద్, వైసీపీ నాయకులు వీరయ్య, భరత్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# మాజీ ఎమ్మెల్సీ సమక్షంలో వైకాపా నుండి టిడిపిలోకి చేరిక



టిడిపి తీర్థం పుచ్చుకున్న వైకాపా నాయకులు

**అమరావ్వరం, మార్చి 24 ప్రభాత వార్త :** మండల పరిధిలోని శివరం గ్రామ పంచాయతీ పరిధిలోని కరేకల్ల హట్టి గ్రామంలో జరిగిన శుభ కార్యంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి సమక్షంలో వైకాపాకు చెందిన నాయకులు తెలుగుదేశం పార్టీలోకి చేరి తీర్థం పుచ్చుకున్నారు. ఇందులో సున్నకల్లుహట్టి గ్రామానికి చెందిన వై. లింగరాజు మాజీ ఎమ్మెల్సీ సమక్షంలో టిడిపి పార్టీలోకి చేరారు. అదే విధంగా మరికొందరూ వివిధ పార్టీల నుంచి టిడిపి పార్టీలోకి చేరారు. ఈ కార్యక్రమం నందు మండల కన్వీనర్ గణేష్, టిడిపి జిల్లా కార్యదర్శి నరసిహమూర్తి, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి కెఎన్‌పల్లి సురేష్, ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షులు జయకుమార్ ఆలుదపల్లి ఈరన్న, మాజీ సర్పంచ్ ఈరన్న, గుజ్జారప్ప పాల్గొన్నారు.

# శుభకార్యంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ



శుభ కార్యంలో పాల్గొన్న దృశ్యం

**అమరాపురం, మార్చి 24 ప్రభాతవార్త :** మండల పరిధిలోని శివవరం పేలుబండ కెకె హట్టి తదితర గ్రామాల్లో టిడిపి పార్టీ నాయకులు ఇంటిలో జరిగిన శుభ కార్యాంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. ఈసందర్భంగా స్థానిక యువ టిడిపి నాయకులు ఎమ్మెల్యే కోటా కింద టిడిపి అభ్యర్థి అనురాధా విజయం సాధించడంతో స్థానిక కార్యకర్తలు మాజీ ఎమ్మెల్సీ సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ప్రతి గ్రామంలోనూ మాజీ ఎమ్మెల్సీకి టిడిపి నాయకులు ప్రజలు, నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భగా రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ చేపట్టిన ఉద్యమాలతోపాటు యువళం పాదయాత్ర నారాలోకేష్‌బాబు చేపట్టడం ద్వారా విజయాలకు నాందిగా నిలిచినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గణేష్, టిడిపి జిల్లా కార్యదర్శి నరసిహమూర్తి, రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి కెఎన్‌పల్లి సురేష్, ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షులు జయకుమార్ ఆలుదపల్లి ఈరన్న, మాజీ సర్పంచ్ ఈరన్న, గుజ్జారప్ప లు పాల్గొన్నారు.

# కేజీబీవీలో 6వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల ఆహ్వానం

- ఉరవకొండ కేజీబీవీ ప్రిన్సిపాల్ యం.ధనలక్ష్మి

**ఉరవకొండ, మార్చి 24 ప్రభాతవార్త**

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 2023-24 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాల కోసం విద్యార్థినుల నుండి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఉరవకొండ కేజీబీవీ ప్రిన్సిపాల్ యం.ధనలక్ష్మి తెలిపారు. శుక్రవారం ప్రిన్సిపాల్ విలేఖరులతో మాట్లాడుతూ ఉరవకొండ కేజీబీవీలో 6వ తరగతిలో 60 సీట్లు ఖాళీగా ఉన్నాయని దరఖాస్తులను ఈనెల 27వ తేదీ నుండి ఏప్రిల్ 20వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనాథలు, బడి బయటి పిల్లలు, బడి మానేసిన వారు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడ్డ మద్యం, నాటుసారా ధ్వంసం

-పర్యవేక్షించిన సీఐ, ఎస్ఐ, సెబ్ సీఐ బృందం



మద్యంను ధ్వంసం చేస్తున్న దృశ్యం

**ఉరవకొండ, మార్చి 24 ప్రభాతవార్త :** ఉరవకొండ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ పరిధిలో 5 ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడ్డ 4,280 (90ఎంఎల్) మద్యం టెట్రా ప్యాకెట్లతోపాటు 6 లీటర్ల నాటు సారాను శుక్రవారం సాయంత్రం యుపీఎస్ పోలీసులు, సెబ్ అధికారులతో కలిసి ధ్వంసం చేశారు. పోలీస్ స్టేషన్ వెనుకగల మైదానంలో టెట్రా ప్యాకెట్లు, నాటుసారాను నేలపై పరిచి ట్రాక్టర్‌తో తొక్కించి ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో యుపీఎస్ సీఐ వి.హరినాథ్, ఎస్ఐ టి.పి.వెంకటస్వామి, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ బి.మారుతీరావు సిబ్బంది పాల్గొన్నారు.

# మానసిక వికలాంగ విద్యార్థులకు వాటర్‌బాటిళ్ళు పంపిణీ



విద్యార్థులకు వాటర్‌బాటిళ్ళు అందిస్తున్న దృశ్యం

**పుట్టపర్తి రూరల్, మార్చి 24, ప్రభాతవార్త**

పుట్టపర్తి మున్సిపాలిటి పరిధిలోని ఎనుములపల్లి, మరియు మండల కేంద్రమైన బుక్కపట్నంలలో మానసిక వికాలంగ పాఠశాలల్లోని విద్యార్థులకు ఖిద్మత్ ఎఖల్క్ ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు షామీర్ బాషా ఆధ్వర్యంలో శుక్రవారం వాటర్ బాటిళ్ళను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఖదీరున్ వాటి తండ్రి జ్ఞాపకార్థం ఈ వాటర్ బాటిళ్ళను దాదాపు 30 మంది విద్యార్థులకు వాటర్‌బాటిళ్ళతో పాటు విద్యోపకరణాలు వితరణ చేసినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో షాకీర్, అలీ, చాంద్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా సరస్వతి పూజ



శ్రీసరస్వతి దేవి పూజ చేస్తున్న దృశ్యం

**మడకశిర మార్చి 24 ప్రభాతవార్త;** మండల పరిధిలోని ఆమిదాల గొంది గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు కె.విశ్వనాథ్ సార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాఠశాల కమిటీ సభ్యులు శుక్రవారం ఘనంగా సరస్వతి పూజను నిర్వహించారు. శ్రీసరస్వతి చిత్రపటాన్ని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యే కంగా పూజలను నిర్వహించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు కె.విశ్వ నాథ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో నడుచుకోవాలని కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి పాఠశాలకు జన్మనిచ్చిన తల్లితండ్రులకు ఉన్న ఊరుకు మంచి పేరు తేవాలని ఆయన అన్నారు. ఈసంవత్సరం పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు మంచి ఉత్తీర్ణతలు సాధించాలని ఆయన కోరారు. పూజల అనంతరం అందరికి తీర్థప్రసాదాలను పంచిపెట్టారు.

# ప్రతి రైతు ఎరువును ఉపయోగించుకోండి

-చెత్త సేకరణ శిక్షణ తరగతులు ప్రారంభం

-సర్పంచు సరోజానాగేనాయక్



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచు



శిక్షణ ఇస్తున్న దృశ్యం

**గోరంట్ల, మార్చి 24 ప్రభాతవార్త :** ఏ పంచాయతీలో తడిపొడి చెత్తలను వేరు చేసి రైతులకు ఉపయోగపడే విధంగా ఎరువును తయారు చేస్తున్న తరుణంలో ప్రతి రైతుకు అవగాహన కల్పించాలని సర్పంచు సరోజానాగేయక్ పేర్కొన్నారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలోని చెత్త సేకరణ కేంద్రం ఆవరణలో ఎంపిడిఓ రఘునాథగుప్తా ఆధ్వర్యంలో శు క్రవారం డిపిఆర్‌సి హేమావతి గోరంట్ల మండలంలోని గోరంట్ల, మల్లాపల్లి పంచాయతీలతో పాటు బుక్కపట్నం మండలంలోని సిద్దరాంపురం, ఎం.అగ్రహారం, కొత్తచెరువు మండలంలోని నాగిరెడ్డిపల్లి, భైరవపురం గ్రామ పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సర్పంచు సరోజానాగేనాయక్ మాట్లాడుతూ పట్టణంలోని ప్రతి ఇంటిలో చెత్తను ట్రాక్టర్ల ద్వారా చెత్త సేకరణ కేంద్రానికి తరలించి తడి చెత్తను, పొడి చెత్తను వేరు చేసి రైతులకు ఉపయోగపడే విధంగా పంచాయతీ కార్మికులు అహర్నిశలు కష్టపడుతున్నారని అదేవిధంగా మండలంలోని రైతులు పశువులపేడ, పశువుల కింద ఏర్పడిన చెత్తను పారవేయకుండా చెత్త సేకరణ కేంద్రానికి పంచాయతీ సిబ్బంది తరలించిన అనంతరం ఆ పేడ ద్వారా తయారు చేసిన ఎరువును విక్రయించి అదే రైతుకు 65 శాతం ఇవ్వడం జరుగుతుందన్నారు. పట్టణంలోని ప్రజలు కూడా చెత్తను ఎక్కడ పడితే అక్కడ పారవేయరాదని పంచాయతీ సిబ్బంది ఎక్కడ ఏర్పాటు చేసి వుంటే అక్కడే వేయాలని సర్పంచు తెలిపారు. ఈ కార్య క్రమంలో ఎంపిపి ప్రమీలమూర్తి, జెడ్‌పి కో ఆప్షన్ మెంబర్ డాక్టర్ బాష, జెడ్‌పిటిసి పాలే జయరాంనాయక్, పంచాయతీ కార్యదర్శి సతీష్‌కుమార్, మల్లాపల్లి సర్పంచు శివానంద, కొత్తచెరువు ఎంపిడిఓ సిద్ధారెడ్డి, బుక్కపట్నం ఎంపిడిఓ శ్రీనివాసులు, ఇఓఆర్‌డి ఇందిరాబాల, అగ్రహారం సర్పంచు నాగేంద్రమ్మ, గోరంట్ల, మల్లాపల్లి కార్యదర్శులు, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

# జీనవాండ్లపల్లి మారెమ్మ దేవాలయం వద్ద ఘనంగా ఉట్లపరుస

**గోరంట్ల, మార్చి 24 ప్రభాతవార్త :** మండలంలోని పులేరు పంచాయతీ జీనవాండ్లపల్లి గ్రామ సమీపంలో వెలసిన మారెమ్మ దేవాలయం వద్ద ఉట్ల పరుసను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు ఉదయం అమ్మవారికి పూజా కార్యక్రమాలు ప్రారంభించి సాయంత్రం జరిగిన ఉట్ల పరుసలో జీనవాండ్లపల్లి, కాంగారెడ్డిపల్లి, చమలయ్యగారిపల్లి, మల్లెల, గోరంట్ల గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇందులో భాగంగా పలువురు ఉట్ల మాను ఎక్కి ఉట్టిని కొట్టడం జరిగింది. ఈ ఉట్ల పరుసలో ఎలాంటి అపశృతి జరగకుండా సిఐ సుబ్బరాయుడు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచు శ్రీనివాసులు, బోయ లక్ష్మినారాయణ, పాల్గొన్నారు.



ఉట్లమాను ఎక్కుతున్న దృశ్యం

# ఉర్దూ పాఠశాలలో విద్యార్థులకు అట్టలు, పెన్నులు పంపిణీ



అట్టలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**గోరంట్ల, మార్చి 24 ప్రభాతవార్త :** పట్టణంలోని ఉర్దూ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 30 మంది విద్యార్థులకు పిఆర్‌టియు మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అట్టలు, పెన్నులు మండల విద్యాధికారి గోపాల్‌నాయక్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఓ మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు కష్టపడి బాగా చదివి అందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని పేర్కొన్నారు. అదేవిధంగా పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చక్కగా మంచి మార్కులు తీసుకొచ్చి పాఠశాలకు, తల్లిదండ్రులకు కీర్తి ప్రతిష్టలు తీసుకరావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దివాకర్‌రెడ్డి, మండల నాయకులు విద్యాసాగర్, నరేందర్‌రెడ్డి, సురేష్, శివారెడ్డి, నబీరసూల్, నాగేంద్ర, ఫైరోజ్, జయసింహారావు, పాల్గొన్నారు.

# ఘనంగా సరస్వతీపూజ



సరస్వతి విగ్రహానికి పూజలు చేస్తున్న విద్యార్థినీ, విద్యార్థులు

**కనగానపల్లి, మార్చి 24 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 10వతరగతి విద్యార్థినీ, విద్యార్థులు శుక్రవారం హైస్కూల్ హెచ్ఎం లక్ష్మీదేవి ఆధ్వర్యంలో స్కూల్ ఆవరణలో సరస్వతీదేవి విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే హెచ్ఎం లక్ష్మీదేవి మాట్లాడుతూ సరస్వతీదేవి అనుగ్రహంతో పరీక్షలు బాగా వ్రాసి మంచి మార్కులు తీసుకొచ్చి పాఠశాలకు మంచి పేరు తీసుకరావాలని వారిని దీవించారు. ఈ కార్య క్రమంలో ఉపాధ్యాయులు గిరక నాగన్న, అబ్బాస్, ఉపాధ్యాయినిలు సునీతరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏఐఎస్‌ఎఫ్ మండల కార్యవర్గం ఏర్పాటు



ఎన్నికైన ఏఐఎస్ఎఫ్ మండల కార్యవర్గం

**కనగానపల్లి, మార్చి 24 ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని ఓబులేసు దేవాలయం వద్ద శుక్రవారం మండల ఏఐఎస్‌ఎఫ్ కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ఏఐఎస్‌ఎఫ్ కార్యవర్గ సభ్యులు విజయ భాస్కర్ ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రైతు సంఘం జిల్లా కార్యవర్గసభ్యులు బెల్లం మహదేవ్, మండల కార్యదర్శి బాలరాజు పాల్గొన్నారు. ఏఐఎస్‌ఎఫ్ మండల శాఖ అధ్యక్షులుగా చైతన్య, ప్రధాన కార్యదర్శిగా నరేంద్ర, మండల ఉపాధ్యక్షులుగా అశోక్, సుధీర్, నాగమోహన్, సహాయ కార్యదర్శులుగా రాజేష్, కృష్ణ, రంజిత్, 22 మంది మండల కార్యవర్గసభ్యులను ఎన్నుకోవడం జరిగింది.

# జూదరుల అరెస్ట్

**అగళి, మార్చి 24 ప్రభాతవార్త :** మండలంలోని ఆలూడి గ్రామ పొలిమేరలో జూదమాడుతున్న పది మందిని ఎస్ఐ లావణ్య, సిబ్బంది అరెస్ట్ చేశారు. జూదరుల నుండి 15,200 రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఇనగలూరు గ్రామంలో జూదమాడుతున్న నలుగురిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. గత మూడు రోజులుగా ఎస్ఐ లావణ్య జూదకేంద్రాలపై వరుస దాడులు చేస్తుండడంతో దాదాపు ఇప్పటికే 40మందికిపైగా జూదరులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది, పేకాట, మట్కా, అక్రమ మద్యం, అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక దృష్టి సారించి అలాంటి వారిపై ఎస్ఐ, సిబ్బంది దాడులు చేస్తున్నారు.

# కరెంట్ లేక మూడు రోజులుగా అంధకారం



గ్రామస్తులు నిరసన తెలుపుతున్న దృశ్యం

**అగళి, మార్చి 24 ప్రభాతవార్త :** మండలంలోని నంగాలితాండా గ్రామంలో విద్యుత్ తీగలు తెగిపడి మూడు రోజులుగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఆ గ్రామం అంధకారంలో వుంది. ఉగాది పండుగ సీజన్ కావడం, మూడు రోజులుగా కరెంట్ లేకపోవడంతో గ్రామ ప్రజలు తాగు, సాగునీటికి ఇబ్బంది పడ్డారు. సదరు విషయంపై లైన్‌మెన్‌కు పలుమార్లు పోన్ చేసినా ఫోన్ లిఫ్ట్ చేయక నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకుని సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# న్యాయవాదిపై పోలీసులకు, న్యాయమూర్తికు పిర్యాదు

- చర్యలు తీసుకోవాలన్న బాధితుడు మీనుగ మధుబాబు



యుపీఎస్ సీఐ వి.హరినాధ్‌కు పిర్యాదు చేస్తున్న బాధితుడు మీనుగ మధుబాబు

**ఉరవకొండ, మార్చి 24 ప్రభాతవార్త**

పట్టణానికి చెందిన ఒక న్యాయవాదిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం ఉరవకొండ ఫస్ట్‌క్లాస్ మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో మేజిస్ట్రేట్‌ను కోరడంతోపాటు అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో సీఐ వి.హరినాధ్‌కు రాతమూలకంగా పిర్యాదు చేయడం జరిగిందని బాధితుడు, సమాచార హక్కు చట్టం జిల్లా కార్యదర్శి మీనుగ మధుబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన భార్య రేణుకమ్మకు, పట్టణానికి చెందిన ఒకరికి మధ్యకు గత కొంత కాలంగా ఆస్తి తగాదా ఉందని అయితే వారి తరపున న్యాయవ్యాది రేణుకమ్మ పేరు మీద కాకుండా తన పేరుమీద దావా వేశారన్నారు. అంతే కాకుండా సివిల్ దావాలో పలు క్రిమినల్ అంశాలు పొందుపర్చి తాను ఒక రౌడీ షీటర్‌నని, రౌడీ గ్యాంగ్ నడుపుతున్నానని ఆరోపణలు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు పరువునష్టం కలిగించేలా వ్యవహరిస్తున్న న్యాయవాదిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

# చరిత్రపుటల్లో నిలిచేలా యువగళం - వడ్డెర సాధికార రాష్ట్ర కన్వీనర్ వడ్డె వెంకట్

ఓబుళదేవరచెరువు, మార్చి 24, ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర చరిత్ర పుటల్లో నిలిచిపోయేలా ఉంటు ందని వడ్డెర సాధికార రాష్ట్ర కన్వీనర్ వడ్డె వెంకట్ పేర్కొన్నారు. యువగళం పాదయాత్ర జనసమీకరణ కోసం శుక్రవారం వడ్డె వెంకట్ ఓడిసి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నారా లోకేష్ చేపట్టిన పాదయాత్రకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. కదిరి, ఓడిసి మండలంలో ఇంత వరకూ జరిగిన యువగళంలో లోకేష్‌కు అడుగడుగునా తెలుగు చెల్లెమ్మలు, తెలుగు తమ్ముళ్ళ ప్రజలు హరతులు ఇచ్చి స్వాగతం పలుకుతూ తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి గెలుపు నామ మాత్రమే అన్నారు. ఇందుకు నిదర్శనం ఇటీవల జరిగిన పట్టుభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలే నిదర్శనం అన్నారు. జరగబోయే పుట్టపర్తి నియోజకవర్గంలో యువగళం పాదయాత్ర మరో చరిత్ర గా నిలిచిపోతుందన్నారు. పుట్టపర్తి నియోజకవర్గంలో ఉన్న తెలుగుదేశం పార్టీ శ్రేణులు పాదయాత్రలో పాల్గొని విజయ వంతం చేయాలని కోరారు. వడ్డె వెంకట్ వెంట ఐటిడిపి మంజునాథ్, నాగరాజు, వీరాంజి నేయులు, రాము, మోహన, రమేష్‌లు తదితరులు ఉనా న్నరు.


స్వాగత ఏర్పాట్లలో వడ్డె వెంకట్

## ఓడిసి వారపు సంత వేలం

ఓబుళదేవరచెరువు, మార్చి 24, ప్రభాతవార్త : స్థానిక గ్రామ పంచాయితీ కారా ్యలయంలో శుక్ర వారం వారపు సంత వేలంపాట జరిగింది. ఈఓఆర్డీ రాజశేఖర్ ఆధ్వర్యంలో కార్యదర్శి ప్రకాష్ వేలం పాట నిర్వహించారు. సర్పంచ్ గోవిందు, ఉప సర్పంచ్ నారాయణ, వార్డు సభ్యులు జమ్మల మడుగు జానీ బాష హజరయ్యారు. వారపు సంత వేలం పాటను తుమ్మల హిదాయతుల్లా రూ 393500లకు, బస్టాండ్‌లో లోడింగ్, అన్‌లోడింగ్ వేలంపాటను మండోజి ఆరీఫ్‌ఖాన్ రూ 190500లకు సొంతం చేసుకున్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రామలింగారెడ్డి, డిజిటల్ అసిస్టెంట్ ఓంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


వేలం పాట నిర్వహిస్తున్న పంచాయితీ కార్యదర్శి

## యువగళం పాదయాత్ర నేటి వివరాలు

ఓబుళదేవరచెరువు, మార్చి 24, ప్రభాతవార్త : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇప్పటి వరకూ 625 కిలోమీటర్ల పాదయాత్ర సాగించారు. నేడు(శనివారం) 50వ రోజు యువగళం పాదయాత్ర ఓడీచెరువు మండలం వణుకువారిపల్లి విడిది కేంద్రం నుంచి ఉదయం 9 గంటలకు ప్రారంభమై సాయంత్రం 6.40 గంటలకు ముగియ నున్నట్ల మాజీ మంత్రి, పట్టపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పల్లె రఘునాథరెడ్డి తెలియచేశారు. ఉదయం 10 గంటల కు గాజుకుంటపల్లిలో రైతులతో సమావేశం. 10.55 వడ్డివారిపల్లిలో ఎస్టీ సామాజికవర్గ ప్రముఖు లతో భేటి. 11.50 గంటలకు ఓడీచెరువులో భోజన విరామం. 2.25 ఓడీచెరువు మండల కేంద్రం నుంచి పాదయాత్ర కొనసాగింపు. 2.35 తహశీల్దార్ కార్యాలయం సమీపంలో మైనార్టీలతో భేటి, సాయంత్రం 4 గంటలకు వేమారెడ్డిపల్లి సమీపంలోని రెయిన్‌బో స్కూల్ వద్ద బహిరం గసభలో లోకేష్ ప్రసంగం. 5.45 గంటలకు మహమ్మదాబాద్ క్రాస్ వద్ద అమడగూరు, స్థానికులు, సత్యసాయి వాటర్ సప్లై వర్కర్లతో సమావేశం. 6.40 గంటలకు రామయ్యపేట వద్ద విడిది కేంద్రంలో బసచేస్తారన్నారు.

## ఉరి వేసుకొని ప్రభాకర్‌నాయుడు మృతి

నల్లచెరువు, మార్చి 24, ప్రభాతవార్త: మండల కేంద్రంలోని మేకల వీధిలోని పెద్దఎల్లంపల్లివాసి అద్దెఇంట్లో కాపురం ఉంటున్న ప్రభాకర్‌నాయుడు (67) శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడటం జరిగింది. వివరాలలోకి వెళితే మృతుడు కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుం డటంతో మనస్థాపానికి గురై ఉరివేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు ప్రభాకర్ నాయుడుకు భార్య, కొడుకు ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానిక ఎస్సై వరలక్ష్మీ తమ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని మృతి పట్ల విచారణ చేసి కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగింది.


మృతికి గల కారణాలు పరిశీలి స్తున్న ఎస్సై వరలక్ష్మీ

## చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన రమణారెడ్డి

నల్లచెరువు, మార్చి 24, ప్రభాతవార్త: రాబోవు ఎన్నికలలో వైసిపి మళ్ళీ అధికారంలోకి రాబోతుందని పంచాయతీ జోనల్ ఇన్‌చార్జ్ రమణారెడ్డి అన్నారు. తాడేపల్లి రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే మనకు శ్రీరామరక్ష అని తెలిపారు. అనంతరం చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని పంచాయితీ రాజ్ జోనల్ ఇన్‌చార్జ రమణారెడ్డి మర్యా దపూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందించారు. వీరితో పాటు ఎంపిపిల రాష్ట్ర సంఘం అధ్యక్షులు హనుమంతరావును తన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగు చ్ఛం అందించారు. వైస్ ఎంపిపి నారాయణ స్వామి, సర్పంచ్‌లు సంఘం అధ్యక్షులు దాసరి శ్రీనాథ్ రెడ్డి, యువనాయ ఁకులు సానే, యనమల హరినాథ్‌రెడ్డి, ఆడిటర్ దినేష్‌రెడ్డిలు పాల్గొన్నారు.


చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని కలిసిన పంచాయతీరాజ్ జోనల్ ఇన్‌చార్జ్ రమణారెడ్డి

## క్షయవ్యాధిపై అవగాహన

నంబులపూలకుంట, మార్చి 24, ప్రభాతవార్త: మండల పరిధిలోని వంకమద్ది గ్రామంలో వైద్యులు డాక్టర్ ఆనంద్ వర్ధన్, డాక్టర్ ఆసియా, ఆశా వర్కర్లు కలిసి క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చడం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ ఆసియా మాటాడుతూ ఎవరికైనా రెండు వారాలకు మించి దగ్గు ఉన్నట్లైతే ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి గళ్ళ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## బాజాపా శక్తి కేంద్ర ప్రముఖులతో వజ్ర

నంబులపూలకుంట, మార్చి 24, ప్రభాతవార్త: భారతీయ జనతా పార్టీ శక్తి కేంద్ర సమాశంలో భాగంగా నంబులపూలకుంట మండల అధ్యక్షులు కొసెట్టి రామ్మోహన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బీజేపి కార్యాలయంలో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి బీజేపి జిల్లా అధ్యక్షులు వజ్రభాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శక్తి కేంద్ర ప్రముఖులను ఉద్దేశించి మాట్లాడుతూ సమావేశంలో శక్తికేంద్ర ప్రముఖులందరూ తమ తమ శక్తి కేంద్రాలలో ఉన్నటువంటి నాయకులను, కార్యకర్తలను కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఎప్పుడైతే మనం బీజేపి కేంద్రం ఇస్తున్నటువంటి పతకాలను జనం మద్యలోకి తీసుకెళ్ళి వారికి తెలియజేస్తామో అప్పుడు ప్రతి ఒక్కరికీ నరేంద్రమోదీ పేద ప్రజలకు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి తెలుస్తుందని తెలిపారు.


పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

### వైసిపి నుండి బీజేపిలోకి చేరిక :

మండల పరిధిలోని దనియానిచెరువు గ్రామానికి చెందిన కె.ఖలీల్‌కు పార్టీ కండువ కప్పి సాధరంగా బీజేపి పార్టీలోకి ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ బీజేపి జిల్లా కార్యదర్శి అశోక్, మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బాబ్‌జాన్, సీనియర్ నాయకులు గురువు రెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకటరమణ, చంద్రమోహన్‌రెడ్డి, రవీంద్ర,రామ్మోహన్, చలపతి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు అందుబాటులో లేని పంచాయతీ కార్యదర్శులు

నంబులపూలకుంట, మార్చి 24, ప్రభాతవార్త: మండల కేంద్రంలోని సచివాలయం -1, 2లు ఉమ్మడి గా ఉండటం వల్ల శుక్రవారం మండల ప్రజలు వారి వారి సమస్యలమీద పంఛాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేయాలనే ఉద్దేశ్యంతో సచివాలయం కావడం జరిగింది. కానీ రైతులకు అందుబాటులో ఉండాల్సిన పంఛాయతీ కార్యదర్శులు లేకపోవడంతో ప్రజలు, రైతులు ఎవరికి తమ సమస్యలు చెప్పాలో తెలియక వెనుతిరిగారు. అదేవిధంగా ఈ రెండు సచివాలయాలలో సిబ్బంది కూడా సమీపాలన పాటించకుండా రిజిస్టర్‌లలో వారి ప్రోగ్రామ్‌లను నమోదు చేస్తూ సొంతపనులకు ఎక్కువగా సమయాన్ని కేటాయిస్తున్నారని మండల ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ రెండు సచివాలయాల దగ్గర ఎంపిడిఓ కార్యాలయం ఉందన్న విషయం కూడా మరిచిపోయి సచివాలయ సిబ్బంది నిర్లక్ష ్యంగా వ్యవహరిస్తుండటం గమనార్హం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకొని సిబ్బంది సమయపాలన పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.


సిబ్బందిలేక ఖాళీగా ఉన్న సచివాలయం

## శక్తి కేంద్ర సమావేశంలో పాల్గొన్న వజ్రబాస్కర్‌రెడ్డి

తలుపుల, మార్చి 24,ప్రభాతవార్తః మండలకేంద్రంలో శనివారం నిర్వహించిన శక్తి కేంద్ర సమావేశంలో శ్రీసత్య సాయి జిల్లా బిజెపి అధ్యక్షులు వజ్ర బాస్కర్‌రెడ్డి. రైల్వేబోర్డు మెంబర్ తలుపుల గంగాదర ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఇంచార్జులతో సమావేశం నిర్వహించా రు.మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అందిసు ్తన్న పథకాలు ప్రజలకు వివరించాలని తెలియచేశారు.మన రాష్ట్రంలో మౌళిక వసతుల కల్పనకు కే ద్ర ప్రభుత్వం అత్యంత పాద్రాన్యత ఇచ్చిందన్నారు.ఈ కార్యక్రమంలో హిం దూపురం పార్లమెంట్ విస్తారక్ జయ చంద్ర, మండల అధ్యక్షుడు గుడిసె ఆదినారాయణ, ఓబుళరెడ్డి, అశోక్. వెంకటేశ్వర్లు,గంగయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వజ్రబాస్కర్‌రెడ్డి

## అంగరంగవైభవంగా బొబ్బిలికోటలో అమ్మవారి ఊరేగింపు

అమడగూరు, మారి ్చ 24 ప్రభాతవార్త మండలంలోని ఏ.కొత్తపల్లి బొబ్బిలికోట గ్రామంలో ఉగాది పండుగను పురస్కరించుకుని శ్రీచౌడేశ్వరిదేవి అమ్మవారి ఊరేగింపు గ్రామస్తుల ఆధ్వర్యంలో అంగరంగవైభవంగా జరిగింది. గ్రామపెద్దలు ఆలయ ధర్మకర్త పొట్టా పురుషోత్తంరెడ్డి, గ్రామస్తుల సమక్షంలో అమ్మవారిని ఇంటింటికి ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి తీర్థప్రసాదాలు అందచేశారు. ఉగాది పండుగ రోజు నుండి వచ్చే పౌర్ణమి వరకు అమ్మవారు 16 గ్రామాల్లో తిరుగుతూ గ్రామస్తులందరికి ప్రత్యేక దర్శనం ఇస్తారు. ఊరేగింపు అయిన తరువాత ఘనంగా శ్రీఅమ్మవారి చౌడేశ్వరి జ్యోతి మహోత్స వాలను ధర్మకర్త సమక్షంలో లక్షలాది మంది భక్తుల నడుమ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా నాట్య కళాకారులు, డ్రామాలు, చెక్కభజనలతో హరికథలతో భక్తులు సంతోషంగా ఈ కార ్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ జ్యోతి కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుండి లక్షలాది మంది భక్తులు తరలివస్తారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఎంపిటిసి పెద్దప్పయ్య, హరినాథ్‌రెడ్డి, జెసిబి నరసింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, జయరాంరెడ్డి, లక్ష్మన్న, రామప్ప, వెంకట రమణ, లక్ష్మినారాయణ, చౌడప్ప, శివ, అంజి, వెంకటస్వామి, చిన్నప్ప య్య, శ్రీనివాసులు, గంగులప్ప, రమణ, రంగా, రాము, అభి, తదితర గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.


అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

## విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి

పెద్దవడుగూరు, మార్చి 24 ప్రభాతవార్త విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి పాఠశాల తో పాటు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకరావాలని శ్రీసరస్వతి హైస్కూల్ కరస్పాండెంట్ మారుతిప్రసాద్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని శ్రీసరస్వ తి హైస్కూల్లో శుక్రవారం 10వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి చదువులతల్లి శ్రీసరస్వతిపూజను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా కరస్పాండె ంట్ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహిం చాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార ్యక్రమంలో కృష్ణవేణి, రామకృష్ణ, వినయ్‌కుమార్, చాంద్‌బాష, ఆనంద్‌బాబు, సునీల్, తదితరులు పాల్గొన్నారు.


సరస్వతిపూజలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

## క్షయవ్యాధిపై అవగాహన

పెద్దవడుగూరు, మార్చి 24 ప్రభాతవార్త మండల కేంద్రంలోని ప్రాథ మిక ఆరోగ్య కేంద్రం లో శుక్ర వారం క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస బాబు, డాక్టర్ అమర్ నాథ్‌లు మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాల గురించి తెలియచే శారు. రెండు వారాలకు మించి దగ్గు వుండడం, బరువు తగ్గడం, సాయంత్రం జ్వరం రావడం లక్షణాలు వున్న వారు గల్ల పరీక్ష చేయించుకుని మందులు వాడాలని తెలియచేశారు. ఈ మందులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా లభిస్తాయన్నారు. మందులు వాడే సమయంలో 6 నెలల వరకు పౌష్టికాహారం కోసం నెలకు 500 రూపాయల చొప్పున ప్రభుత్వం వ్యాధిగ్రస్తులకు అందించడం జరుగుతుందని వారు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ చిట్టితల్లి, ఎంపిహెచ్ఇఒ వినయ్‌కుమార్, పిహెచ్ ఎం హేమలత, సూపర్‌వైజర్ శ్రీనివా సులు, రామక్క, ఎంఎల్‌హెచ్‌పిఎస్, హెల్త్ అసిస్టెంట్, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## వక్ఫ్‌బోర్డు, షాధీఖానా బకాయిలు చెల్లింపు

తాడిపత్రిఅర్బన్, మార్చి 24 ప్రభాతవార్త గత కొన్ని సంవత్సరాలుగా వక్ఫ్‌బోర్డు వారు మున్సిపాలిటీకి ప్రాపర్టీ ట్యాక్స్ రూపంలో బకాయిపడిన 29 లక్షల రూపాయలకు గాను వడ్డీ లేకుండా 25 లక్షల రూపాయలు, అదేవి ధంగా షాధీఖానా వారు బకాయి పడిన మున్సిపల్ ప్రాపర్టీట్యాక్స్ 12 లక్షల రూపాయలకు గాను 8 లక్షల రూపా యలను వన్‌టైం సెటిల మెంట్ కింద వడ్డీ లేకుండా ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసిన జిఒ ప్రకారం హీరాపురం ఫయాజ్‌బాష ఆధ్వర్యంలో వక్ ్ఫబోర్డు కమిటీ, షాధీఖానా కమిటీ వారు మున్సిపల్ కార్యాలయానినికి చేరుకుని మున్సిపల్ కమీషనర్ జబ్బార్ మియా, అడ్మిన్ రామ్మోహన్, ఆర్ఐతో చర్చించి బకాయిపడిన ట్యాక్స్‌ను మున్సిపాలిటీకి 33 లక్షల రూపాయలను చెల్లించిన ట్లు కమీషనర్ తెలిపారు. రంజాన్ మాసం సందర్భంగా తెల్లవారుజామున 3 గంటలకు మంచినీటిని విడుదల చేయాలని 2వవార్డు కౌన్సిలర్ హీరాపురం ఫయాజ్‌బాష కోరడంతో స్పందించిన కమీషనర్ నీటిని విడుదల చేయిస్తామని హామి ఇచ్చారు.


కమీషనర్‌కు బకాయి మొత్తాలను చెల్లిస్తున్న దృశ్యం

## తాగునీటి సమస్యను పరిష్కరించండి

తాడిపత్రిఅర్బన్, మార్చి 24 ప్రభాతవార్త తాడిపత్రి పట్టణంలోని 30వవార్డులో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆవార్డు కౌన్సిలర్ విజయ్‌కుమార్ శుక్రవారం మున్సిపల్ కమీషనర్ జబ్బార్‌మియాకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ ప్రస్తుతం వేసవికాలం కావడంతో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. పప్పూరురోడ్డు లోని కస్తూరిబా స్కూల్ సమీపంలోని 15 దళిత కుటుంబాల వారు గత ఐదు సంవత్సరాల నుండి తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నారన్నారు. వారు చాలా దూరం వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి వుందన్నారు. ఈ వేసవికాలంలో నీటి ఎద్దడి తీవ్రమవుతుండడంతో అక్కడి ప్రజల సౌకర్యార్థం ఒక బోరు వేసి ట్యాంకు నిర్మించి తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆయన కమీషనర్‌ను కోరారు.


వినతిపత్రం అందచేస్తున్న కౌన్సిలర్ విజయ్‌కుమార్

## నీటి కొరతకు పరిష్కారం

తాడిపత్రిఅర్బన్, మార్చి 24 ప్రభాతవార్త పట్టణంలోని 2వవార్డులో ఆ వార్డు కౌన్సిలర్ హీరాపురం ఫయాజ్‌బాష బోరు వేయించి నీటి కొరతను పరిష్కరించారు. వార్డులో కౌన్సిలర్ ఫయాజ్‌బాష పర్యటిస్తున్న సందర్భంలో వార్డు ప్రజలు తాగునీటి సమస్య గురించి ఆయనకు విన్నవించుకున్నారు. ప్రస్తుతం వేసవికాలం కావడంతో నీటి సమస్యతో ఇబ్బంది పడుతున్నామని ఇప్పటికే పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించినా మా గోడు వినే నాథుడు లేడని మీరే ఎలాగైనా తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఫయాజ్‌బాషను కోరడంతో ఆయన స్పందించి దాదాపు 2 లక్షల రూపాయల సొంత ఖర్చుతో బోరు వేయించడం ప్రారంభించారు. తాగునీటి సమస్యను పరిష్కరించడం పట్ల వార్డు ప్రజలు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేశారు.


బోరు వేయిస్తున్న ఫయాజ్‌బాష

## విద్యార్థులు మంచి మార్కులతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

యల్లనూరు, మార్చి 24 ప్రభాతవార్త విద్యార్థులు మంచి మార్కులతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మనోహర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం సరస్వతి పూజను ఘనంగా జరుపుకున్నారు. ఇందు లో భాగంగా పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులు భక్తిశ్రద్ధలతో చదువులతల్లి సరస్వతిదేవి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించి నమస్కరించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనోహర్ మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి వత్తిడికి గురికాకుండా పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి పాఠశాలతో పాటు తల్లిద ండ్రులకు మంచి పేరు తీసుకరావాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం ఆయనతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సరస్వతి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

## ఉద్యోగస్తుల ఆధ్వర్యంలో నేడు ఛలో అనంతపురం

యాడికి, మార్చి 24 ప్రభాతవార్త మండల వ్యాప్తంగా వున్న ఉద్యోగుల న్యాయమైన కోరికల సాధన కోసం శనివారం నిర్వహి ంచ తలపెట్టిన ఛలో అనంతపు రం కార్య క్రమానికి తరలివచ్చి విజయవం తం చేయాలని ప్రభుత్వ ఉద్యో గుల సంఘం తెలిపింది. మన జీతాల చట్టబద్ధత, పిఆర్‌సి ఆరియర్స్ సాధన కోసం, డిఎల సాధన కోసం, జిపిఎఫ్‌ఎస్ఎల్ఎస్ బిల్లుల కోసం, మన దగ్గర నుండి వెనక్కు తీసుకున్న జిపిఎఫ్ జీతాల కోసం, కాంట్రాక్ట్ ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కోసం, కంటెంట్ ఉద్యోగుల రెగ్యుల రైజేషన్ కోసం, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల పెంపు కోసం, ఉద్యోగ ఉపాధ్యాయ పెండింగ్ మెడికల్ ఎంబర్స్‌మెంట్ బిల్లుల చెల్లింపు కోసం సకాలంలో ప్రతి ఆర్థిక ఆర్థికేతర సమస్యల పరిష్కారం కోసం నేడు నిర్వ హించ తలపెట్టిన ఛలో అనంతపురం కార్యక్రమానికి తరలిరావాలని ఉద్యో గుల సంఘం ఓ ప్రకటనలో తెలిపింది.


పోస్టర్లు విడుదల చేస్తున్న ఉద్యోగులు

## ఎమ్మెల్యే నాగేంద్ర సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ నాయకులు

బళ్లారి, మార్చి24, ప్రభాతవార్త ; రూరల్ ఎమ్మెల్యే బి.నాగేంద్ర నాయకత్వం నచ్చడంతో ఆయన సమక్షంలో స్థానిక 25 వ వార్డు రేడియోపార్కు ప్రాంతం బీజేపీ నాయకులు రంజిత్‌నాయుడు, శబరీ ష్‌లు తమ వందలాది మంది అనుచరులతో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. తాము స్వచ్ఛందంగా కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ఎమ్మెల్యే నాగేంద్ర జనప్రియ నాయకుడిగా రూరల్ క్షేత్రంలో చేపట్టిన అభివృద్ధి పనులు చూసి తాము కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు రంజిత్‌నాయుడు, శబరీష్‌లు తెలిపారు. ఈ సందర్భంలో మాట్లాడిన ఎమ్మెల్యే నాగేంద్ర తన పనితీరు మెచ్చుకొని కాంగ్రెస్‌లోకి చేరిన రంజిత్‌నాయుడు, శబరీష్ బృం దాన్ని అభినందిస్తున్నట్లు, పార్టీ అభివృద్ధికి శ్రమించాలని కోరుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంలో సందీప్, వినోద్, గురు, గణేష్, అక్షయ్, విన య్, ఉపేంద్ర, సంతోష్, అంజి, శేఖన్న, మహేష్, నవీన్‌నాయుడు, లక్ష్మణ్, షఫీ ఉల్లా, సంజు, వీరేష్, మంజులు నాగేంద్ర అందించిన కాంగ్రెస్ బావు టాలు స్వీకరించారు. ఈ సందర్భంలో కాంగ్రెస్ కౌల్‌బజార్ నాయకులు టి.జి.ఎర్రిస్వామి, బి.వెంకటేష్‌ప్రసాద్, సరగు సురేష్, సునీల్, కె.రంజిత్, ముండ్రగి నాగరాజు, వక్ ్ఫబోర్డు చైర్మన్ హుమయూన్‌ఖాన్, అల్లాబకాష్, గుమ్మనూరు జగన్నాథ్, గుజరీ బసవరాజ్, నాగులకెరె గోవింద్, ఆయాజ్‌అహ్మద్, కె.హొన్నప్ప, షమీర్, బెణకల్ బసవరాజుగౌడ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే నాగేంద్ర సమక్షంలో బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

## 12వవార్డులో పర్యటించిన ఎమ్మెల్యే కేతిరెడ్డి

తాడిపత్రిఅర్బన్, మార్చి 24 ప్రభాతవార్త పట్టణంలోని 12వవార్డులో శుక్రవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన 12వ వార్డు సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. సచివాలయం పరిధిలో ప్రభుత్వ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన సిబ్బందితో మాట్లాడుతూ సమన్వ యంతో పనిచేయాలని, ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేవి ధంగా చూడాలన్నారు. పార్టీలకు అతీతంగా అర్హులైన అందరికి పథకాలు వర్తించేలా చూడాన్నారు. సమస్యలు వుంటే తెలియచేయాలని ఆయన సిబ్బం దికి సూచించారు. ఎమ్మెల్యే వుంట పలువురు వైసిపి నాయకులు, కార ్యకర్తలు వున్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

## వెంగన్నపల్లిలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం

యాడికి, మార్చి 24 ప్రభాతవార్త మండలంలోని వెంగన్నపల్లి గ్రామంలో శుక్రవారం ఆర్డీటి ఆధ్వర్యంలో అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు, ఇంటికి దీపం ఇల్లాలు తదితర నినాదాలతో గ్రామ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. బాలికల చదువు అభివృద్ధికి తొలిమెట్టు అంటూ మహిళా ఉపాధ్యాయులతో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్ప కుండా విద్యావంతులను చేయాల్సిందిగా ఈ సంద ర్భంగా ఆర్డీటి సిఇ ఆనంద్ తెలియచేశారు.


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

## ఎస్‌సి స్మశానవాటిక కోసం స్థలం కేటాయించండి

యాడికి, మార్చి 24 ప్రభాతవార్త మండలంలోని నిట్టూరు గ్రామంలో నివాసం వుంటున్న మాదిగలకు స్మశాన వాటిక లేదని, అనుకూలమైన స్థలాన్ని కేటాయించాలని కోరుతూ శుక్రవారం నిట్టూరు గ్రామానికి చెందిన ఎస్‌సి కాలనీవాసులు తహశీల్దార్ అలెగ్జాండర్‌కు వినతిపత్రం అందచేశారు. ప్రస్తుతం ఎస్‌సి కాలనీలో ఎవరైనా మృతి చెందితే వంక గట్టున అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌సి కాలనీవాసులు తెలిపారు. అయితే గత కొంతకాలంగా వర్షాల కారణంతో ఈ అంత్యక్రియల కార ్యక్రమం తీవ్ర ఆటంకాలకు గురవుతున్నట్లు కావునా తమపై దయచేసి ఎస్‌సి కాలనీకి అనుకూలమైన స్మశాన స్థలాన్ని కేటాయించాల్సిందిగా వారు తహశీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో నిట్టూరు గ్రామానికి చెందిన ఎస్‌సి కాలనీవాసులు పాల్గొన్నారు.


తహశీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

## నేడు యాడికిలో పర్యటించనున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

యాడికి, మార్చి 24 ప్రభాతవార్త ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి శనివారం యాడికి మండల కేంద్రంలో పర్యటించనున్నట్లు మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు తెలిపారు. ఎంపి బొంబాయి ఉమాదేవి, మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, ఉపసర్పంచు కాసా చంద్రమోహన్, శ్రీశివలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయ కమిటీ చైర్మన్ బొంబాయి రామిరెడ్డి, తదితర ప్రజాప్రతినిధుల ఆహ్వానం మేరకు ఉదయం 9గంటలకు శ్రీశివలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం ఎదురుగా వున్న నూతన భవనాలను, పెద్దమ్మగుడి వద్ద ఇటీవల నూతనంగా నిర్మించిన భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ కార ్యక్రమానికి మండలంలోని వైకాపా నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.

## సరిహద్దులో గట్టి నిఘా ఉంచండి -ఎస్‌పి రాహుల్‌దేవ్ సింగ్

పుట్టపర్తి, మార్చి 24, ప్రభాతవార్త అంతరాష్ట్ర సరిహద్దులలో గట్టినిఘా ఉంచాలని, ప్రస్తుతం ప్రక్క రాష్ట్రమైన కర్ణాటకలలో ఎన్నికలు జరుగుతున్నందున ప్రత్యేక చర్యలు తీసుకోవాలని శ్రీసత్యసాయి జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్ సింగ్ సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్‌పి కార్యాలయం నుండి నెలవారి నేరసమీక్ష నిర్వహించిన ఆయన పలు మార్గదర్శకాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ, చట్టవ్యతిరేక కార్యకలాపాలైన మట్కా, గుట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్‌లపై ప్రత్యేకంగా నిఘా ఉంచాలని, స్పందన కేసులు, ఫ్యాక్షన్ కేసులు, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటి తదితర కేసులపై సర్కిళ్ళవారీగా సమీక్షించి పురోగతిపై ఆరాతీ శారు. కేసుల్లో ఉన్న నిందితుల అరెస్ట్ విషయంలో నిబంధనలు పాటిం చాలని, పోలీస్ వ్యవస్థ పట్ల ప్రజల్లో నమ్మకం కలిగేలా పనితీరు మెరుగుప రుచుకోవాలని సూచించారు. చెక్‌పోస్టుల్లో తనిఖీలు ముమ్మరం చేయాలని, అక్రమ రవాణాను అడ్డుకోవాలని, ముఖ్యంగా మద్యం, గుట్కా, ఇసుక అక్రమ రవాణాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్‌పి కె.వి.రామకృష్ణప్రసాద్, ఎస్‌బిడిఎస్‌పి ఉమామహేశ్వర్‌రెడ్డి, డిఎస్‌పిలు యశ్వంత్, భవ్యకిషోర్, హుసేన్‌పీరా, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**నాటురాసార నష్టాలపై అవగాహన కల్పించండి** గ్రామీణ ప్రజల్లో నాటుసారా వల్ల కలిగే నష్టాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని ఎస్‌పి కె.వి.రామకృష్ణప్రసాద్ సెబ్ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్ సింగ్ ఆదేశాలమేరకు శుక్రవారం సెబ్ కార్యాలయం నందు నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా ఇతర రాష్ట్రాల నుండి ఎన్‌డిపిఎల్, డిపిఎల్, నాటుసారా, ఇసుక అక్రమ రవాణ తదితర కేసులపై స్టేషన్ల వారీగా సమీక్ష నిర్వహించారు. వివిధ కేసులలో అరెస్ట్ కాని నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, తరచూ నేరాలకు పాల్పడేవారిపై ఇదివరకే రౌడీషీట్లు తెరవడం జరిగిందని, అలాంటి వారికి కౌన్సిలింగ్ చేపట్టాలని సెబ్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సెబ్ అధికారులు, సిఐలు పాల్గొన్నారు.

**హత్య కేసులో శిక్ష ఖరారు :** ధర్మవరం మండలం నిమ్మలకుంట గ్రామానికి చెందిన రమావత్ రమేష్‌నాయక్(33) అనే వ్యక్తి మృతికి కారణమైన తిరుపాల్ నాయక్ అనేవ్యక్తికి అనంతపురం 1వ ఎడిజె కోర్టు శిక్ష ఖరారు చేసినటులన ఎస్‌పి రాహుల్ దేవ్ సింగన ఒక ప్రకటనలో తెలియ ఁజేశారు. వివరాల ప్రకారం 2016లో ధర్మవరం మంలం నిమ్మల కుంట గ్రామానికి చెందిన రమావత్ రమేష్ నాయక్, అతని భార్య అనంతపురం జిల్లా వజ్రకరూరు మంలం పెద్ద వెంకటంపల్లి తాండాకు చెందిన మంజూబా యిల మధ్య ఏర్పడిన మనస్పర్థల కారణంగా గ్రామంలో పెద్ద మనుషుల పంచాయతీ పెట్టగా అందులో మాటామటా పెరిగి తిరుపాల్ నాయక్ అనే వ్యక్తి ఐరన్ బాక్సుతో రమేష్‌నాయక్ తలపై కొట్టడంతో బలమైన గాయాలయ్యాయని, అలాగే మృతుడి తమ్ముడు మోతిలాల్ నాయక్‌పై కూడా దాడులు నిర్వహించారని, ఈ సంఘటనలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ, రమేష్‌నాయక్ మృతి చెందడంతో వీరిపై మృతుని సోదరుని పిర్యాదు మేరకు దర్మవరం రూరల్ పోలీస్ స్టేషన్ నందు క్రైంనెం బర్ 82/2016 కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ కేసులో మూడే సోమల నాయక్, మూడే రమణమ్మ, రామావత్ మంజుబాయి, మూడే తిరుపాల్‌నాయక్, రమావత్ హీరూనాయక్‌లను నిందితులుగా చేర్చడం జరిగిందన్నారు. ఈ కేసులో అనంతపురం 1వ ఎడిజె జడ్జి ఎస్.రమేష్ తుది తీర్పునిస్తూ మూడే తిరుపాల్ నాయక్‌కు 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ. 10వేల జరిమాన విధించారని, మిగిలిన ముద్దాయిలను నిర్దోషులుగా విడుదల చేయ డం జరిగిందన్నారు. పైకేసులో నిందితుడికి శిక్షపడేలా వ్యవహించిన విచారణ అధికారి సిఐ వై.యుగంధర్, ఎస్ఐ మురళీక్రిష్ణ, పబ్లిక్ ప్రాసిక్యూటర్ లక్ష్మినారాయణ రెడ్డిలను జిల్లా ఎస్‌పి రాహుల్‌దేవ్ సింగ్ ప్రత్యేకంగా అభినందిం చారు.

**ఎన్‌ఎంఎంఎస్‌లో అర్హతసాధించిన విద్యార్థులు 27లోగా వివరాలు పంపండి**

కొత్తచెరువు, మార్చి 24, ప్రభాతవార్త గత నెల ఫిబ్రవరి 05వ తరగతి జరిగిన ఎన్‌ఎంఎంఎస్ పరీక్షల్లో అర్హత సాధించిన విద్యార్థులు తమ వివరాలను ఈ నెల 27వ తేదిలోగా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సమర్పించానలి ఇన్‌చార్జ్ డిఇఓ మీనాక్షి ఓ ప్రకటనలో తెలియజేశారు.

